# సాధన

## స్వామి చిత్రానంద

"ఏమండీ! పిన్నిగారూ! ఈ వారం పత్రిక చూశారా?"

"ప్రభ చూశారా?"

"జ్యోతి చూశారా?"

—అంటూ ఆమె చుట్టూ చేరిన వారందరికీ, ఆమె చేతిలోవున్న వారపత్రికల్ని అందరికీ తలొకటీ యిచ్చింది. వున్నది మూడు వారపత్రికలు, కాపరాలు ఆరు. అంచేత విధిగా, కొన్ని వారపత్రికలు రెండేసి ప్రతులు కొనితీరాల్సివచ్చింది. అవన్నీ తీసుకున్న ఆ ఆడవారు-అలవాటుగా వనితావాణి పేజీ చదివారు. అందులో 'ఆమెగారు' రాసిన వుత్తరమో, అడిగిన ప్రశ్నో వుంటుంది. 'ఆమెగారి' పేరు అచ్చులో చూసిన ఆ ఆడవారు ఆమెకన్న ఎక్కువగా ఆనందపడిపోతారు - కాని, 'ఆమెగారు' మాత్రం—

"ఈ ప్రభేనండి-మరీ పొడి అక్షరాల్లో వేస్తోంది—"ఏ.జె."అంటూ—" అని విసుక్కుంది.

ఆమె పేరు జానకి—ఆమె భర్త పేరు జానకిపతి-ఆమె యింటి పేరు ఆచంటవారు. ఆమె వుంటున్న యిల్లు పేరు జానకీనివాస్. వారి ఇంటికి పక్కనేవున్న, వారి ఆరు వాటాల మధ్యతరగతివారి 'కాలనీ' పేరు మిథిల. ఆవిడగారి భుజాలదాకా వచ్చే, ఆ యింటి ప్రహరీ దగ్గరకువచ్చి 'ఆమెగారు' నిలబడితే, ఆ ఆరు గుమ్మాళ్ళవారూ కనబడతారు. ఆ ఆరు వాటాలలోవారినీ, వారి వారి వయసులకు తగిన విధంగా 'పిన్నిగారూ!' 'అక్కగారూ!' 'వదినగారూ!' అనో లేక, వారివారి పేర్లతోనో పిలుస్తూ వుంటుంది.

వారంతా వచ్చి, గోడకి అవతల పక్కన నిలబడతారు. ఇలా రోజుకు కనీసం అయిదారు సార్లయినా, వారిని పిలవాలి. లేకపోతే ఆమెకు తోచదు. వారంతా నెలనెలా అద్దె కట్టుతున్నా, 'ఆమెగారి' యింట్లో అద్దెకు వుంటున్న పాపానికి 'ఆమెగారి' పిలుపు వినగానే, చేతిలో పని అలాగే మానేసి, వచ్చి ఆమెకు ఎదురుగా నిలబడాలి. ఆమె చెప్పింది చెవులారా వినాలి. ఆ విన్నదంతా బాగుందనాలి. ఇంతకుమించి ఆమె వారిదగ్గర్నించి ఏమీ కోరదు—ప్రతినెలా మొదటి వారంలో ఒక నెల అద్దె తప్ప.

ఆ నెల మొదటి వారంలో మొదటిసారిగా పిలవబడిన పిన్నిగారు ఆఖరి వాటాలో వుంటున్నది. 'ఆమెగారి' పిలుపు వినగానే ఆదరాబాదరా, చేతులో పని అలాగేపడేసి వచ్చింది. 'ఆమెగారి' ఎదురుగా తలవంచుకుని ముద్దాయిలా నిలబడి—

"అద్దె సంగతి చెబుదామనే, పొద్దున్నే అటు వచ్చాను. తలుపు తీసిలేదు-డబ్బింకా చేతికి అందలేదు. పత్రికవాళ్లు ఎంచేతో ఈనెల ఆలస్యం చేశారు," అంది క్షమాపణ కోరుతూ.

—ఇదంతా శ్రద్ధగా విన్న జానకి—

"పిన్నిగారూ! నాకో ఐడియా వచ్చింది. ప్రతినెలా మీవాడు ఓ కథ రాయడం, ఆ కథ ఏ పత్రికకో పంపడం-వాళ్ళు ఆర్నెల్ల తర్వాత- "ప్రచురించడానికి అంగీకరించాము వీలు వెంబడి ప్రచురించగలం", అని మరో ఆర్నెల్లకి ప్రచురించడం, ప్రచురించిన ఆర్నెల్లకి 'పారితోషికం' అంటూ ఏదో మని ఆర్డరు చేయడం-దాన్ని నాకు అద్దెగా యివ్వడం-ఎందుకిదంతా? నా అద్దెకింద నాకు నెలకో కథ రాసియివ్వమనండి - చాలు-" అంది.

"అద్దె రూ. 75/-లు కదా? వాడి కథకి ఎవరూ యాభై దాటి యివ్వరు" అంది పిన్నిగారు.

"అది మీకు లాభమేకదా? అంచేత మీ వాడికి నచ్చచెప్పండి. కథమాత్రం ప్రతినెలా మొదటి వారంలో నాకు యివ్వాలి." అంది జానకి.

"సరేనమ్మా — మా వాడితో చెప్పి చూస్తాను."

"చెప్పిచూడ్డం ఏమిటండీ? నచ్చచెప్పండి - సాయంత్రం మళ్ళీ కలుస్తాను," అంటూ లోపలకు వెళ్ళింది.

హాల్లోకి రాగానే—

"ఏమండీ! ఈ వారం పత్రిక చూశారా?" అంది భర్తతో.

"విన్నాను—అదే....పత్రికలో నీ లేఖ, ప్రభలో నీ ప్రశ్న, జ్యోతిలో నీ సందేహం పడ్డాయి. ప్రభలో మాత్రం నీ పేరు పూర్తిగా పడలేదు—"

"సంతోషించాం లెండి—మళ్ళీ నెలనించి ప్రతినెలా ఏదో వారపత్రికలో ఏదో కథ పడి తీరుతుంది." అంది గర్వంగా.

"తిని కూచోలేక ఇదేం పనే?" అన్నట్టు చూశాడు భార్య వంక.

"అవునండి-నేను రచయిత్రిని అవాలి."

"అవాలంటే, నువ్వు రాయొద్దూ? నీకంత తీరుబడి ఎక్కడుంది? ఎంతసేపూ పక్కవాటా



వాళ్ళతో కబుర్లు చెప్పడంతోటే సరిపోతుంది. కవిత్వం అంటే, మాటలా? ఆయన ఎవరో చెప్పినట్టు, పుట్టడమే కవిగా పుట్టాలి—" అన్నాడు భర్త వినయంగానే—

"అదేం అఖ్ఖర్లేదు. బోయవాడు వాల్మీకిగా మారి రామాయణం రాయలేదా? సినీమా కవులు ఎంతమంది పుట్టగానే కవులయ్యారు చెప్పండి?"

"అది నిజమే. సినీమాల్లో మనకంటికి కనిపించేదీ, చెవికి వినిపించేదీ వాళ్ళ వాళ్ళ సొంతాలు కావట—అన్నింటికీ 'ప్లే బ్యాక్' వుంటుందట!

"అలాగే, నాకూ ఓ 'ప్లేబ్యాక్' వుంది. సరేనా?" అంది గర్వంగా—

"ఎవరు? సుశీలా? జానకా?" అన్నాడు వేళాకోళంగా.

"కాదు—ఘంటసాల—" అంటూ కోపంగా లోపలకు వెళ్ళిపోయింది.

"ఘంటసాల పోయి చాలా కాలమైందిగా? కొంపదీసి, జూనియర్ ఘంటసాల ఎవరైనా?—" అని సణుక్కుంటూ దినపత్రిక తిరగేశాడు.

* * *

ఆరోవాటా పిన్నిగారు వాళ్ళ అబ్బాయి కోసం, ఎదురుచూస్తోంది. చీకటిపడ్డ తర్వాత వచ్చాడు ప్రసాద్.

"ఏరా! ఇంత ఆలస్యం అయింది?"

"కథ పూర్తిచేసేసరికి ఆలస్యం అయింది" అంటూ షర్టు విప్పుకుని, లోపలకు వెళ్ళాడు.

"ఒరేయ్! జానకమ్మగారు ఇందాక వచ్చి, అద్దె అడిగిందిరా" అంటూ తల్లి చెప్పింది.

"ఇస్తామని చెప్పు. ఇవాళ మూడో తారీఖేగా—10 తారీఖుగ్గాని నెల అవదు. ఈలోపుగా పత్రికనించి మనిఆర్డరు వస్తుంది."

"వస్తే, అది బియ్యంవాడికి యివ్వొచ్చు. నువ్వు రాసిన కథ యిలా యివ్వు - ఆవిడకి యిచ్చేస్తాను."

"ఆవిడకెందుకు?"

"ఏమో, అద్దెకింద నెలకి ఓ కథ యిమ్మన మంది."

"ఏడవలేకపోయింది. ఈకథ తనదని పత్రికలకి పంపి, 'రచయిత్రిని' అయిపోవాలనుందేమో!"

"ఆవిడ ఏమైతే మనకేమిరా? ఏదో ఓ కథ రాసి, ఆవిడ ముఖాన పడేస్తే, నెలదాకా మనల్ని అద్దె అడగదు. పైగా నీ కథలకి ఏ పత్రికా ఏభైరూపాయలకన్న ఇవ్వడంలేదు. ఈవిడకిస్తే, రు. 75/-లు వచ్చినట్టేగా?"

"అదేవిటమ్మా - చూస్తూ చూస్తూ ఆత్మద్రోహం చేసుకోలేను. నా కథ ఆవిడకు యివ్వలేను" అన్నాడు నిష్కర్షగా.

"ఆహా! బయల్దేరాడండి—అపరపోతన!" అంది అప్పుడే లోపలకు అడుగుపెడుతున్న చెల్లెలు శారద, పుస్తకాలు అలమారాలో పెడుతూ—

"నోర్ముయ్, నీ అభినందనలు ఎవడికీ అక్కర్లేదు. ఎక్కడికెళ్లావ్ ఇంతవరకూ!"

"కాలేజీకి—"

"7-30 గంటలదాకా కాలేజీ ముయ్యలేదా?"

"ఆలస్యంగా వస్తానని అమ్మతో చెప్పాను."

"ఆ ఆలస్యమే ఎందుకయ్యిందీ అని?" అని రెట్టించాడు.

"ఏ స్నేహితులు ఇంటికో వెళ్లంటుందిరా" అని కూతురును సమర్థించబోయింది తల్లి.


"ఎవడా స్నేహితుడు? ఎక్కడ వాడి ఇల్లు? ఇవాళ తేలాలి."

"ఏమిట్రా నువ్వనేది?" అంది తల్లి. ఒక్కసారిగా విభ్రాంతపోయింది. పెళ్ళీడుకొచ్చిన పిల్ల, కాలేజీకి వెళ్తోందనుకుంటున్న పిన్నిగారికి- ఈ మాటలు పిడుగులా వినిపించాయి.

"ఏమిటమ్మా! ఇది నిజమేనా?" అంటూ శారద దగ్గరకువెళ్ళి సముదాయిస్తూ అడిగింది పిన్నిగారు.

"లేదమ్మా-నేను వాళ్ల వాణి ఇంటికే వెళ్లాను" అంది తలవంచుకుని శారద.

"వాణి యింటికే వెళ్ళింది సరే. వాణి అన్నకోసం వెళ్లిందా లేదా? వాడు రమ్మంటేనే, వాణి దీన్ని తీసుకువెళ్ళింది. అవునా?




కాదా? ఇప్పుడు తేలాలి."

"వాణి కుటుంబం సంగతి నాకు తెలియంది కాదు. ఆ మాత్రానికే ఇంత రాద్ధాంతం ఏవిటిరా?" అంటూ యిద్దరినీ సముదాయించి భోజనాలకు రమ్మంది.

ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే భోజనాలు చేశారు. అతను మాత్రం భోజనం చేసిన వెంటనే పడుకున్నాడు. శారద ఏవో పుస్తకాలు తిరగేస్తోంది. పిన్నిగారు ఆమె దగ్గరకు వచ్చి కూచుంది.

"ఏమ్మా! అన్నయ్య చెప్పింది నిజమేనా?" అని అడిగింది ఆశగా.

అవునన్నట్టు తలవూపింది శారద.

"వాణి ధర్మమా అని నువ్వు ఆ యింటి కోడలివైతే, నాకు ఏ బెంగా వుండదు." 'వాణి చెబితే, వాళ్ళ నాన్నగారు కట్నంకూడా పుచ్చుకోరు' అనుకుంది పిన్నిగారు.

"కాని-అతను.... వాణి వాళ్ళ అన్నయ్య కాదమ్మా" అంది శారద.

"మరి—?" నిర్ఘాంతపోతూ అడిగింది పిన్నిగారు.

"వాళ్ళ దూరపు బంధువు. బొంబాయిలో పెద్ద వుద్యోగంట - చాలా బాగా వుంటాడు. ఇవాళ నన్ను సినీమాకి తీసుకెళ్ళాడు."

"సిగ్గులేకండా, సినీమాకి వెళ్ళావా పరాయి మగాడితో-" గద్దించింది పిన్నిగారు.

"వాణి, వాళ్ళ అన్నయ్యకూడా వచ్చారమ్మా—" అంది శారద.

"ఏమోనమ్మా-మీ నాన్నగారుంటే ఆ దారి వేరు. ఏదో, నిన్నో యింటిదాన్నిచేస్తే, నా కదే పదివేలు—"

"ఆయన మనింటికి వస్తానన్నారు. కాని అన్నయ్య ఎప్పుడూ చుర్రు బుర్రు మంటూ వుంటాడని, నేనే వద్దన్నాను."

"వాణిని ఓసారి రమ్మను-నేను మాట్లాడతాను."

"అలాగే నమ్మా—"

* * *

బొంబాయి అబ్బాయి సెలవు పొడిగించాడు. వాణి, వాళ్ళ అన్నయ్య మాత్రం శారదకు

అతణ్ణి పరిచయంచేసి వూరుకున్నారు. శారద కాలేజీ మానెయ్యడం, అతనికోసం అతను వస్తానన్నచోట అతనికోసం ఎదురుచూడ్డం-ఇద్దరూ సినిమాలు చూడ్డం-షికార్లు తిరగడం-రానురాను మరీ దగ్గరవుతున్నారు. వీళ్లిద్దరూ కలిసివుండగా, అన్నయ్యకి తటస్థపడ్డారు. శారద అతనితో—

"మా అన్నయ్య"అని పరిచయం చేసింది.

"మీరు—?"అని సందేహంగా బొంబాయి అబ్బాయికేసి చూశాడు.

"ఈయన వాణివాళ్ళ దూరపు బంధువు. అమ్మ చెప్పలేదూ? ఆయనే ఈయన."

"అమ్మ చెప్పడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాద్.

"ఈయన నేను ప్రేమించుకున్నాం. పెళ్లి—" అని శారద చెప్పబోతూంటే, అతనే ఆపుచేశాడు.

"మీ చెల్లాయికి మరీ తొందరండి. పెళ్లంటే నూరేళ్ళపంట. చాలా ఆలోచించుకోవాలి. బొంబాయిలో కాపరం అంటే మాటలు కాదు. బ్రహ్మచారిగాణ్ణి గనక, నలుగురు బ్రహ్మచారులతో కలిసి, ఓ గదిలో వుంటున్నాను. కాపరం పెట్టడానికి ఒక ఫ్లేట్ కావాలంటే, నా వల్లకాదు—" అని తన బాధ చెప్పాడు బొంబాయి అబ్బాయి.

"పెళ్లికీ దీనికీ సంబంధం ఏమిటి?" అన్నాడు శారద అన్నయ్య.

"పెళ్లిదారి పెళ్లిది. దీనిదారి దీనిది. ఏదో పరిచయం, స్నేహం, నాలుగురోజులు కలిసి తిరిగాం! విడిపోతాం. అంతే- మళ్ళీ ఎప్పుడో.... ఎక్కడో........" అంటూ చాలా తేలిగ్గా చెప్పాడు.

"ఏమిట్రా కూశావ్?" అని లేచాడు అతని మీదకి. పిచ్చెత్తినవాడిలా అతనిమీద పడ్డాడు. చితకబాదాడు. స్పృహలేకుండా పడిపోయాడు బొంబాయి అబ్బాయి.

"నడు-ఇంటికి- గడపదాటావో, నీకూ అదే శాస్తి" అంటూ శారదను ఇంటికి తీసుకు వచ్చాడు.

తల్లితో జరిగిందంతా చెప్పాడు. ఆమె భోరున యేడ్చింది. తల గోడన వేసుకుని బాదుకుంది. పక్కవాటాల వాళ్ళకు వివరాలు తెలియకపోయినా, "ఏదో ఘోరం" జరిగిందని అర్థమైంది. అంతా ఎవరిమటుకు వాళ్ళు తలుపులు మూసేసుకున్నారు.

* * *

ఆ సాయంకాలం ఓ పోలీస్ జీపువచ్చి, ఆ కాలనీ ముందు ఆగింది. మొదటి వాటాలో వారిని శారద గురించి అడుగుతున్నాడు-పోలీస్ ఇన్స్పెక్టర్. ఇది గమనించిన ప్రసాద్ మెల్లగా చెట్లచాటునుంచి, జానకమ్మగారి యింట్లోకి దూకాడు. ఆ దొడ్లోవున్న చెట్లచాటున దాక్కున్నాడు.

సాయంత్రం పువ్వులు కోసుకుంటున్న జానకమ్మగారికి, ప్రసాద్ కనిపించాడు. ఆమెను చూసి అతను భయపడ్డాడు. అతన్ని చూసిన ఆమె నిర్ఘాంతపోయింది. ఆమె వాళ్ల యింటి వైపు చూసింది. పోలీసులు శారదనూ, పిన్నిగారినీఏదో అడుగుతున్నారు. జానకమ్మగారికి విషయం అర్థమైంది. 'నన్ను కాపాడ'మని ప్రసాద్ ఆమె కాళ్లమీద పడ్డాడు. ఆమెలో యేదో ఆలోచన మెరిసింది. ఏదో నిర్ణయం తీసుకుంది. అక్కడే ఆ గోడదగ్గరే నిలబడి జరిగినదంతా గమనిస్తోంది.

పార్కులో ప్రసాద్ చేత దెబ్బతిన్న బొంబాయి అబ్బాయి మరణించేలా వున్నాడనీ, అందుకోసమే వచ్చామనీ చెప్పాడు ఇన్స్పెక్టర్. ఇంట్లో లేడని చెప్పింది పిన్నిగారు. ఇల్లంతా సోదా చేశారు పోలీసులు. ఆకాలనీలో అంతా తలో రకంగా మాట్లాడారు. "ఈ ప్రేమలూ, హత్యలూ ఏవో వారపత్రికల్లో చదవడమేగాని-నిజంగా జరుగుతాయి అని మాకు తెలియదమ్మా-" అని బుగ్గలు నొక్కుకుంటూ వెళ్లిపోయింది నాలుగోవాటా వదినగారు.

పోలీసులు వెళ్ళడంతో, ఆ గందరగోళం చల్లబడిపోయింది.

* * *

ఆనాటి రాత్రి—

ఆ కాలనీలో రోజూకన్న పెందరాళే

దీపాలు ఆర్పుకున్నారు అంతా. మెలకువగా వున్నారో, నిద్రపోతున్నారో తెలియదు. ఆరో వాటాలో పిన్నిగారు, శారద మాత్రం ప్రసాద్ కోసం యెదురుచూస్తున్నారు. బాధ, భయం వారి ముఖాల్లో తాండవిస్తోంది. ప్రసాద్ చేత దెబ్బలుతిన్న ఆ బొంబాయి అబ్బాయి మరణిస్తే, ప్రసాద్ బతుకు ఏమవుతుంది? అసలు ప్రసాద్ ఏమయ్యాడు? ఇదే ఆలోచన.

ఈ సంగతి తెల్సిన శారద స్నేహితులు కొందరు వచ్చి, ఆమెను ఓదార్చారు. వాణి మాత్రం రాలేదు. తన గురించి, తన అన్నయ్య గురించి వాణి ఏమనుకుంటుందో-ఇదే శారద ఆలోచన.

పక్కమేడలో పై అంతస్తులో తలుపులు అన్నీ మూసివున్న గదిలో ప్రసాద్ వున్నాడు. అతనికి ఏంచేయాలో తోచడంలేదు. పోలీసులకు లొంగిపోయి శరణుకోరితే-తాను జైలుకు వెళ్ళితే, అమ్మ, చెల్లి ఏంకావాలి? తానలా అజ్ఞాతంగా యెంతకాలం వుండాలి? యిదే ఆలోచన.

మరి కాస్సేపటికి జానకమ్మగారు అన్నం కంచంతో వచ్చింది. అతని పక్కనే కూర్చుని తల్లికన్న ఆదరంగా తినిపించింది. ఎంతో ఓదార్పుగా ధైర్యం చెప్పింది. అంత తొందర పనికిరాదని మందలించింది. ఏంజరిగినా అన్నింటికీ భగవంతుడే వున్నాడంది. అతను భోం చేసిన తర్వాత, ఆవిడ కిందకు వెళ్ళి, భర్తతో కల్సి భోజనంచేసి, ఆయన్ని పడుకోమని చెప్పింది-తాంబూలం యిచ్చి.

"ఈ సంగతి నరమానవుడికి తెలియడానికి వీల్లేదు" అని హెచ్చరించింది.

"మరో నరమానవుడితో—నువ్వు నీ నరమానవుణ్ణి కలవనిస్తే కదా తెలియడానికి? నీకా భయం అక్కర్లేదు—నా మాట నమ్ము" అని ఆయన పడకగదిలోకి వెళ్తూ—

"నువ్వు మాత్రం పెందరాళే వచ్చేయ్"అని బతిమాలాడు.

ఆమె మేడమీదకు దారితీసింది.


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!




ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ________

విలాసము: ________

________ PIN ________

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్.

గదిలోకి రాగానే అలికిడి విని అదిరిపడ్డాడు ప్రసాద్.

"ఏం భయంలేదు-నేనే-" అని అక్కడే వున్న కుర్చీలో కూచుంది. అతన్ని సోఫాలో పడుకోమని, ఓ తలగడ, దుప్పటీ యిచ్చింది.

"ఏమండీ! పోలీసులు మళ్ళీ వచ్చారా?" అని ఆతృతగా అడిగాడు ప్రసాద్.

"ఇంతవరకూ రాలేదుగాని, మా యింటి క్కూడా 'ఎంక్వయిరీ'కి రావచ్చని అంటున్నా రాయన."

"మీరే నన్ను కాపాడాలి. నేను జెయిల్‌కి వెళ్తే, మా చెల్లెలు, అమ్మ దిక్కులేని వాళ్ళు. అయిపోతారు. మీరే రక్షించాలి."

"అయితే, ఓ చిన్న పనిచెయ్—"

"మీరేం చెయ్యమన్నా చేస్తాను. నిప్పుల్లో దూకమన్నా దూకుతాను."

"మరీ అంత పురాణకాలపు మనిషినికాదు నేను" అని సందేహిస్తోంది చెప్పడానికి.

"చెప్పండి. సందేహించకండి."

"నువ్విక్కడే వుండు. నువ్వు ఏమయ్యావో ఎవ్వరికీ తెలియదు. కావాలంటే, మీ అమ్మకి, చెల్లెలికి నేను చెబుతాను. వాళ్ళు అప్పుడప్పుడు వచ్చి, నిన్ను చూస్తుంటారు. ఈ సంగతి మూడో కంటివాడికి తెలియనివ్వను. కాని—" అని ఆగిపోయింది.

"ఆగిపోయారేం? చెప్పండి" అని రెట్టించాడు.

"మీ చెల్లెల్ని, మీ అమ్మని, నిన్ను పోషించే భారం నాది. మాకు దూరపుబంధువు ఒక డున్నాడు. తాలూకాఫీసులో పనిచేస్తున్నాడు. బుద్ధిమంతుడు. మీ చెల్లెల్ని వాడికిచ్చి పెళ్ళి చేస్తాను. నువ్విక్కడే వుండాలి. కానీ, ఒక కండిషన్—"

"చెప్పండి."

"నువ్వు కథలు రాయాలి. నాకు ఇవ్వాలి. ఏమంటావ్?" అని ప్రశ్నార్థకంగా చూసింది.

ప్రసాద్‌కి ఏం చెప్పాలో తోచలేదు. ఆత్మ ద్రోహం చేసుకోకుండా వుండలేడు. అలాగని, 'నిజాన్ని చెప్పండి' అని ధైర్యంగా చెప్పలేడు అటు, అమ్మ, చెల్లెలు-వాళ్ళ భవిష్యత్తు. ఇటు తను, తన అభిరుచి, ఆశయం, నియమం వగైరా,వగైరా. ఎటూ తేల్చుకోలేకపోయాడు.

"నన్ను కాస్సేపు ఆలోచించుకోనివ్వండి" అని మాత్రం అన్నాడు.

"కాస్సేపేం ఖర్మ? రాత్రంతా ఆలోచించుకో. వుదయాన్నే వస్తాను. 'అవును' అని మాత్రం చెప్పు" అని కిందకు వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా ప్రసాదుకి నిద్రలేదు. బమ్మెర పోతన గుర్తుకువచ్చాడు. అతనిముందు కన్నీరు కారుస్తున్న సరస్వతీదేవి సాక్షాత్కరించింది అతనికి. ఆమెకు అతడిచ్చిన వాగ్దానం గుర్తొచ్చింది. మరుక్షణంలో శ్రీనాథుడు పోతనను ఎగతాళి చెయ్యడం గుర్తుకొచ్చింది. ఏం చెయ్యాలి? తన అభిరుచి, ధ్యేయం, ఆశయం ఇవి ముఖ్యమా? చెల్లెలు పెళ్ళి, అమ్మ సుఖం ఇవి ముఖ్యమా? రాత్రంతా అదే ఆలోచన. స్వార్థాన్ని త్యాగం జయించింది. అజ్ఞాతంలో వుండడానికి నిర్ణయించుకున్నాడు.

ఉదయాన్నే టూత్‌పేస్టు, బ్రషుతో వచ్చిన జానకమ్మగారు అతన్ని అడక్కుండానే, అతని నిర్ణయం చెప్పాడు. సంతోషంగా కిందకు వెళ్ళింది. భర్తతో ఆమె ప్లాన్‌అంతా చెప్పింది.

"చెప్పండి. 'కవి అనేవాడు పుట్టుకతోనే పుట్టాలి' అన్నారే, ఇప్పుడే మంటారు?" అని దెప్పిపొడిచింది.

"ఏమైనా నువ్వు పెట్టి పుట్టావు జానకీ" అని ఆమెను మనస్ఫూర్తిగా అభినందించాడు జానకీపతి.

గ గ గ

జానకమ్మగారు తమ వీధిగేటు తెరుచుకుని, పక్క గేటులోంచి ఆరువాటాల కాలనీలోకి వెళ్తోంది. ఆ వాటాలో వారందరికీ ఆమె రాక ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎప్పుడూ గోడ అవతల నిలబడి, అందరినీ తనదగ్గరకే రమ్మనే ఆమె—తానుగా వాళ్ళదగ్గరకు రావడం ఆశ్చర్యంగానే వుంది. అంతా "రండి,రండి" అంటూ స్వాగతం చెప్పారు.

"విన్నారా? నిన్న సంగతి?" అంటూ చెప్ప

పోయింది నాలుగో వాటా వదినగారు.

ఆమె మాత్రం నేరుగా ఆరో వాటాలోకి వెళ్ళింది. వీధి తలుపు మూయించింది. జరిగిందంతా చెప్పింది జానకమ్మగారు. తన ప్లాన్ కూడా చెప్పింది. పిన్నిగారు మాత్రం—

"నువ్వు నాకన్న చిన్నదానివి. నీకు నమస్కారం పెట్టకూడదు. ఏం చేసినా నీ రుణం తీరదు. చచ్చి నీ కడుపున పుడతాను" అంది కళ్ళవెంట నీరు కారుతూండగా.


"ప్రసాద్‌ను మీరు అప్పుడప్పుడు వచ్చి, చూసి పోతూండండి. ఈ రహస్యం మూడో కంటివాడికి తెలియకూడదు. అతనివి నాలుగు జతల బట్టలు ఇవ్వండి" అని సంచీలో పెట్టుకుని, పమిట చాటున వాటిని దాచి రహస్యంగా తీసుకువెళ్ళింది.

* * *

ప్రసాద్ రచనలు సాగిస్తున్నాడు. వాటిని జానకమ్మగారు శ్రద్ధగా సాపుచేసి ఆమె పేరిట పత్రికలకు పంపుతోంది. ప్రచురణ అవుతున్నాయి. ఆమె వారికి యిచ్చిన మాటప్రకారం, వాళ్ళ దూరపు బంధువును రప్పించి, పెళ్ళికి ఒప్పించి, పెళ్ళి జరిపించింది. పెళ్లి దగ్గరవుండి జరిపించలేని ప్రసాద్ మేడమీంచే, ఆ దంపతుల్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ, రెండు కన్నీటి బిందువులు రాల్చాడు. అవే ఆ నవ దంపతుల సుఖజీవనానికి అమృతబిందువులు.

నవ దంపతుల్నీ, వారికి తోడుగా పిన్నిగారినీ హైద్రాబాదు పంపించింది జానకమ్మగారు.

జానకమ్మగారు చేసిన సహాయాన్ని, ఆ అయిదు వాటాల్లో వున్నవాళ్ళూ ఏకగ్రీవంగా అభినందించారు. అద్దెకున్నవాళ్ళకు నిత్యావసరమైన, నీరు, గాలిలాంటి సౌకర్యాలే చూడని యజమానులువున్న ఈ మహానగరంలో జానకమ్మగారివంటి యజమానురాలు-అద్దెకున్నవారి ఇంటికి పెద్ద ఆడబడుచులా ముందుకొచ్చి, కన్న కొడుకులేని లోటు తీర్చి, శారదను ఓ యింటిదాన్ని చేసినందుకు అంతా ఆమెను పొగిడారు. ఊళ్ళోకూడా ఈ సంగతి పొక్కిపోయింది. ఎప్పుడూ క్లబ్బుల్లో పేకాడి, రాత్రి పార్టీలనించి లేటుగా వచ్చే నిక్షేపరాయుళ్లు ఒకళ్ళిద్దరు—



"ఉష్! నేనీ బీరువాలో దాక్కున్న సంగతి మావిడతో చెప్పేవ్. ప్రాణాలు తోడేస్తుంది జాగ్రత్త!!"

"ఏమైనా, బ్రదర్! మీరు ఖాళీ చెయ్యకండి. మీకిలాంటి యజమానులు దొరకరు."

"మీరు ఖాళీచేస్తే చెప్పండి. నాకు నలుగురు ఆడపిల్లలు. పెళ్ళికి ఎదిగివున్నారు" అని చమత్కరించాడు మరో నిక్షేపరాయుడు.

ఈ పెళ్ళి జరిగినతర్వాత ఆ హత్యగురించి చెప్పుకోడం మానేశారు. కొత్తనీరు వచ్చి పాత నీటిని కొట్టేసినట్టయింది.

* * *

ప్రసాద్ జీవితం జైలులో వున్నట్టు వున్నా హాయిగా వుంది. పత్రికలు చదవడమేగాని, పత్రికలకు రాయడం మానేశాడు. ఆ అవసరం అతనికి ఇప్పుడులేదు. జానకమ్మగారు మాత్రం రచయిత్రిని అయిపోయాను గదా, రాయకపోతే ఎలాగ అని, రాయడం ప్రారంభించింది. ప్రసాద్ ఆమెకు సాయపడుతూ వుండేవాడు. స్వతంత్రంగా ఆమె పత్రికలకు పంపడం పరిపాటైపోయింది. రచయిత్రిగా పేరు సంపాదించిన ఆమెకు పత్రికకు సంపాదకురాలు అనిపించుకోవాలనిపించింది. స్వంతంగా పత్రికను ప్రారంభించింది. దానికి 'సాధన' అని పేరు పెట్టింది. ఆమె భర్త ప్రచురణకర్త. ఆ అయిదువాటాల్లో వాళ్ళూ ఆమె దీక్ష,పట్టుదలను చూసి ఆశ్చర్యపోయారు.

"తలచుకోవాలేగాని, ఆడది సాధించలేనిది లేదు" అన్నారు మగవాళ్ళు కొందరు.

"నువ్వు వున్నావు ఎందుకూ? ఓ కథ

రాయలేవు" అని భార్యని చీదరించుకున్నాడు మరో వాటాలో భర్త.

ఆమె కథల్ని పుస్తకరూపంగా ప్రచురించాలని, ప్రచురణకర్తలు ముందుకువస్తున్నారు. పుస్తక ప్రచురణ వ్యాపారదృష్టితోగాక, కళాత్మకంగానూ సాహిత్యపరంగానూ చూసేవారి కోసం ఆమె ప్రయత్నించింది. కాని, వారి షరతులు, వ్యాపారపద్ధతులూ ఆమెకు అంతగా నచ్చలేదు. అంచేత తానే స్వయంగా ఎందుకు ప్రచురించకూడదు అనుకుంది. 'సాధన ప్రచురణలు' అనే పేరిట ఓ ప్రచురణ సంస్థ నెలకొల్పింది. తొలి కథల సంపుటికి 'సాధన'అని పేరుపెట్టింది. అందులో పన్నెండు కథలున్నాయి. పుస్తక ఆవిష్కరణకూడా విద్యాశాఖామాత్యులచేతనే చేయించాలని ఆమె కోరిక (ఆ శాఖ మంత్రి స్త్రీ గనుక). ఆమె రాకకోసం ఒక నెలరోజులు ఆగింది కూడా.

* * *

ఆ రోజే గ్రంథ ఆవిష్కరణ మహోత్సవం. కస్తూరిబా విద్యాలయంలో సభ ఏర్పాటయింది. వేదిక ఎంతో అందంగా అలంకరించబడివుంది. వేదికకు వెనకవున్న స్వచ్ఛమైన తెల్లని తెర మీద- "సాధనమున పనులు సమకూరు ధరలోన" అని ప్రస్ఫుటంగా, శుభ్రప్రదమైన పసుపు రంగులో రాయబడివుంది. దానికి కిందనే ఒక స్త్రీ మూర్తి దీక్షతో రాస్తున్న రేఖాచిత్రం వుంది. వేదికకు రెండుప్రక్కలా ప్రఖ్యాత రచయిత్రుల ఫోటోలు వున్నాయి. ఆ సమావేశం యెంత నిరాడంబరంగా జరపాలని అనుకున్నా, మంత్రిగారి రాకతో దానికి ఎక్కడలేని ప్రచారమూ వచ్చి, చుట్టుపక్కల గ్రామాలనుంచి యెందరో వచ్చారు. అందులో కవులు, రచయితలు, పండితులు, సిద్ధాంతులు ఎందరో వున్నారు.

అనివార్య కారణాలవల్ల అనుకున్నచోటికి, అనుకున్న ప్రకారం అమాత్యవరులు రాలేక పోతున్న కారణంగా, ఈ ఆవిష్కరణ సభ కూడా ఆలస్యమైంది.సాయంకాలం అల్పాహార విందు సిద్ధంచేసివుంచారు.మంత్రిణిగారు రాలేదు. సభ ప్రారంభం కాలేదు. అంచేత విందు సమయంలో దాన్ని ఆహూతులకు యిచ్చారు.అంతా అల్పాహార విందును అధికంగా సేవించి— (ఇళ్ళకు ఎప్పుడు వెళ్ళినా బాధలేదన్న ధైర్యంతో) అమాత్యుల రాకకోసం యెదురు చూస్తున్నారు.

అమాత్యులు అగ్రహారంనుంచి బయల్దేరారనీ, ఓ అరగంటలో వచ్చేస్తారనీ, ఒకతను మోటారుసైకిలుమీద వచ్చి చెప్పాడు. అతని కడుపు చల్లగా, అతను చెప్పినట్టే ఆమెగారు వచ్చారు.

కాలేజీ విద్యార్థినులు ఆమెమీద పువ్వులు చల్లారు. నుదుట కుంకుమదిద్ది మంగళహారతి యిచ్చారు. పన్నీరు జల్లారు. వేదపండితులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం చెబుతూ వేదికమీదకు తీసుకువెళ్లారు. వేదికమీదనే సిద్ధంగావున్న మరో బాలికల బృందం ఆమె మెడలో పూలమాలలు వేసింది. అన్నీ ఆమె వెంట వెంటనే తీసేసింది. అన్నిటికన్న లావుపాటి మాలను ఆమె మెడలోవేసి, పుష్ప గుచ్ఛాన్ని చేతికిచ్చి, స్వాగతం పలికింది జానకమ్మగారు. "సాధన" పుస్తకం ప్రతిని ఒక పట్టుచీరలో చుట్టి, వెండి పళ్లెంలోపెట్టి,టేబిల్ ముందు వుంచారు జానకీపతి. టేబిల్ మీద వున్న కార్యక్రమం కాగితాన్ని తీసుకుని చూసి మంత్రిణిగారు—

"కార్యక్రమం చాలా బృహత్తరంగావుంది. నాకూ కార్యాభారం ఎక్కువగానేవుంది.అంచేత చెప్పవలసిన నాలుగుముక్కలూ నేను చెప్పేసి, వెళ్లిపోతాను. ఒక మహిళ, అందులోనూ ఒక ఆంధ్రమహిళ, ఏ ప్రభుత్వ సహాయమూ లేకుండా, తనకు తానుగా స్వయం కృషితో ఈ 'సాధన' అనే పుస్తకాన్ని రాసింది అంటే, స్త్రీలు, పురుషులూ అంతా గర్వపడాల్సిన విషయం. ఇందులోవున్న పన్నెండు కథలూ, ఇంతకుముందే- దినపత్రికల్లో—" ఇంతలో ఆమెకు చెవిలో యేదో చెప్పారు.

"దిన వారపత్రికల్లో కాదట—ఒక్క వార పత్రికల్లోనే వచ్చాయట.విశేష ఆదరణ పొందాయట! ఆ ఆదరణ మూలంగానే, ఆ కథలు



స్త్రీకి ప్రసవవేదన భరించరానిది. రష్యాలోని డా॥ పర్సియానియావ్ ఒక విద్యుత్‌పరికరాన్ని నిర్మించారు. ప్రసవకాలంలో యీ పరికరంలోని తీగలను స్త్రీ నుదుటి మీద వుంచి, విద్యుత్‌తరంగాలను ప్రవేశపెడితే, స్త్రీకి నిద్రముంచుకొస్తుంది. **Electro Sleep** (విద్యుత్ నిద్ర?) లో స్త్రీకి ప్రసవవేదన తెలియకుండా సుఖప్రసవం జరుగుతుంది! ఇటు తల్లికీ, అటు శిశువుకూ యీ విద్యుత్ నిద్ర నిరపాయకరమైనదని తేల్చారు డా॥ పర్సియానియావ్.

---

పుస్తకరూపంలోకి తీసుకువచ్చారు. ఇప్పుడు నేను ఆ గ్రంధాన్ని బయటకు తీసేముందు, మా సోదరి, రచయిత్రిని మనసారా అభినందించి వెళ్లిపోతాను. నాకు చాలా కార్యాభారం వుంది. రచయితలు, రచయిత్రులు ఎందరో వున్నారు. వారంతా వుపన్యసిస్తారు. ఆ వుపన్యాసంకూడా మీరు విని మరీ వెళ్లాలి అని కోరుతున్నాను.

సోదరి జానకి, స్వయంకృషితో, తనకు తానుగా ఎంతో సాధన చేసింది. ఈ పుస్తకాన్ని రచించింది. ఇందులో ఏ పురుషుడి ప్రమేయం లేదు. అది స్త్రీజాతికే గర్వకారణం—''

ఇంతలో— "ఆగండి" అన్న పురుషుడి అరుపు వినబడింది. అంతా అటు తిరిగి చూశారు.

చరచరా ప్రసాద్ వేదికపైకి వస్తున్నాడు. అమాత్యులు నిర్ఘాంతపోయారు. వేదికమీద వున్న మైకును లాక్కున్నాడు ప్రసాద్.

"ఈ కథలన్నీ నేను రాసినవి" అని గర్జించాడు.

సభ అంతా గొల్లున నవ్వారు.

"నవ్వండి. నా బతుకే నవ్వులపాలు చేసుకున్నాను. నేనొక హత్యకేసులో ఇరుక్కుని బయటకు రావడానికి భయపడి, జానకమ్మగారి శరణు జొచ్చాను. నా బలహీనతను ఆమె అదనుగా తీసుకుంది. నా కథలు ఆమె పేరిట ప్రచురించుకోనిస్తే, నా రహస్యం బయటపెట్టనంది. నా చెల్లెలుకు పెళ్లి చేసి, మా కుటుంబాన్ని ఆదుకుంటానంది. ఆ పరిస్థితుల్లో నేను అంగీకరించాను. అజ్ఞాతంగా వున్నాను. కాని- నాకు జరగవలసిన ఈ సన్మానం ఈమెకు జరుగుతుంటే అజ్ఞాతంగా వుండలేకపోయాను."

"ఇదో పెద్ద కథలావుంది" అన్నారు సభలో ఎవరో—

"చెప్పు నాయనా - ఎంత చెప్పాలో అంతా చెప్పు" అంటూ ప్రేక్షకుల్లోని స్త్రీలు గోల చేశారు.

"అయితే, నువ్వు రచయితనంటావు" అన్నది మరో రచయిత్రి.

"అవును. 'కావ్యశ్రీ' అనే కలం పేరుతో అనేక పత్రిల్లో నేను రాశాను."

"ఆ కావ్యశ్రీ నువ్వేనని మాకు రుజువు ఏమిటి?" అని అడిగింది మరో రచయిత్రి.

"మిమ్మల్ని నమ్మించడానికి నా దగ్గర ఇప్పుడు ఆధారాలు లేవు" అన్నాడు ప్రసాద్.

"నీ మాటలు మాత్రం నమ్మమంటావు."

"నమ్మాలి-నమ్మితీరాలి. కావాలంటే, జానకిగారిని అడగండి."

జానకమ్మగారు ఏదో చెప్పబోయింది.

"మీరేం మాట్లాడకండి. నువ్వు నిజంగా రచయితవే అయితే, ఇప్పుడు రుజువుచేసుకో- ఓ విషయం ఇస్తాం - నీకూ జానకిగారికీ ఒకే ఒక గంట వ్యవధి యిస్తాం-రాసి తీసుకురా-" అని ప్రతిపాదించింది మరో రచయిత్రి.




"సరే" అన్నాడు ప్రసాద్.

ఇద్దరికీ చెరో కలం, ఇన్ని కాగితాలూ యిచ్చి, ఓ క్లాస్‌రూంలోకి పంపారు. పర్యవేక్షణకు ఒక రచయిత్రిని కూడా పంపారు.

జనంలో కలకలం, "గ్రంథ చౌర్యం విన్నాం గాని, ఇలాంటి చోద్యాలు వినలేదు" అన్నారు రిటైరయిన ఓ తెలుగు మేష్టారు.

"చౌర్యంకాదు - నా శ్రాద్ధంకాదు. ఇలాగ యేదన్నా అల్లరిచేస్తే, అతనికింత పడేస్తారని ఆశ-" అన్నారు మరో పండితుడు.

గంటసేపూ జనం కూచునే వున్నారు. మంత్రిగారు కార్యాభారం చాలా వుండటంచేత వెళ్ళిపోయారు. బాలికలు ఏవో పాటలు పాడుతూ ప్రేక్షకుల్ని కూచోబెట్టారు.

ఇచ్చిన వ్యవధి పూర్తికాకుండానే, జానకమ్మగారు తన కాగితాలు యిచ్చింది.

ప్రసాద్ మాత్రం తెల్లకాగితాలే యిచ్చాడు తెల్లమొహం వేసుకుంటూ.

"ఏమయ్యా! కవిని అన్నావు. పేరు 'కావ్యశ్రీ' అన్నావు. కనీసం నీ పేరైనా రాయలేదేం?" అని యెత్తిపొడిచింది యువ రచయిత్రి.

"అలవాటు తప్పిపోయింది" అన్నాడు ప్రసాద్.

"కాదు అవసరం తప్పిపోయింది. ఇలా రాయాల్సి వస్తుందనుకోలేదు పాపం" అన్నది మరో రచయిత్రి.

"నువ్వు నిజంగా రచయితవేఅయితే, సాటి రచయిత్రిని యిలా అవమానించకూడదు బ్రదర్- వెళ్లు-" అన్నాడు మరో రచయిత.

అంతా అతన్ని హేళన చేశారు.

ఇంతలో అతనికోసం వెతుకుతున్న పోలీసులు, ఇతని వునికి ఎలా తెల్సిందో- అతన్ని తమతో రమ్మన్నారు.

"ప్రసాద్! ఒక్క నిమిషం" అంటూ జానకమ్మగారు వచ్చి. 'సాధన' పుస్తకం ప్రతి అతనికి యిచ్చింది. దాని అట్ట తిరగేశాడు ప్రసాద్.

"నాకు ఆవేశాన్ని కల్పించి, నన్నూ రచయిత్రినిచేసిన రచయిత- "కావ్యశ్రీ" - కాదు- ప్రసాద్‌కు కృతజ్ఞతతో.

-జానకి,

అని వుంది. ఆ పేజీ తిరగేశాడు ప్రసాద్.

—అంకితం—

"లక్ష్మీ వరప్రసాద్‌కు" అని వుంది.

జానకమ్మగారి విశాల హృదయానికి తనలో తానే నమస్కరించుకుని పోలీసులతో వెళ్ళిపోయాడు ప్రసాద్.

వారి వెంట, జానకీపతిని పంపింది జానకమ్మగారు. □